సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భారీ అన్నసంతర్పణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్ 6వ లేన్, భగత్‌సింగ్ కాలనీలో సాయి విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి ఆర్థిక సాయం చేశారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వెంకట రెడ్డి, నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నవారి చెంతకు మతిస్థిమితం లేని యువతి



నాగలక్ష్మిని ఆమె తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : మతిస్థిమితం లేని ఒక యువతి జూపార్కు దగ్గర ఒంటరిగా సంచరిస్తుండగా ఆరిలోవ పోలీసులు ఆమెను రక్షించారు. టీఎస్ ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి ఆమెను అప్పగించారు. వసతి గృహం కార్యదర్శి ప్రగడ వాసు ఆమె వివరాలపై ఆరా తీశారు. ఆమె తన పేరు నాగలక్ష్మి అని, తమది పోతినమల్లయ్యపాలెం అని తెలిపింది. తల్లిదండ్రుల వివరాలు వెల్లడించింది. దీంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. తల్లిదండ్రులు కుమారి, చిన్నారావు రావడంతో వారికి యువతిని అప్పగించారు.

మనలోని నిద్రాణశక్తిని మేల్కొలపాలి



థియేటర్ ఆర్ట్స్ విద్యార్థినులను సత్కరిస్తున్న వేదభాస్కర్, రమ

అల్లిపురం : భౌతిక సుఖాల పట్ల వ్యామోహం పెంచుకోకుండా మనలోని నిద్రాణశక్తిని మేల్కొలపాలని పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపకుడు వేదభాస్కర్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన దసరా సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన విద్యార్థులను సత్కరించారు.

ఒలింపియాడ్‌లో సంపత్‌కు 7వ ర్యాంకు

సీతమ్మధార: గతేడాది నిర్వహించిన ఒలింపియాడ్ నేషనల్ లెవల్ టెస్ట్‌లో గురుద్వారకు చెందిన విద్యార్థి సంపత్ ఉత్తమ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు, ఉమ్మడి రాష్ట్రాల్లో 7వ ర్యాంకు సాధించాడు. పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థికి ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా శనివారం సంపత్‌ను జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) చంద్రకళ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ కన్వీనర్ గోపినాథ్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రామారావు, స్కూల్ స్టాఫ్ హేన, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606

విజయకారిణి.. అభయరూపిణి

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుంచే మహిళలు అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నసమారాధనలు నిర్వహించారు. కనుల పండువగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

- కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మవారు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో విష్ణులక్ష్మీ కమల పూజలో పాల్గొన్న మహిళలు



శాకంబరిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కనకదుర్గగా సాగరగిరి కనకదుర్గమ్మ



శ్రీ మహాలక్ష్మిగా పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారు శనివారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్, దుర్గా నూకేశ్వరరావు, దేవస్థానం మహిళా విభాగం సభ్యులు కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, పి. సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నప్రసాద వితరణ..

జిల్లా పరిషత్ శ్రీకృష్ణ చైతన్య మఠం ఆటోస్టాండ్, కలెక్టర్ కార్యాలయం జంక్షన్ వద్ద రావిదుర్గా గణపతి ప్రసన్న ఆంజనేయ ఆటోస్టాండ్ ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద శనివారం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ దంపతులు పాల్గొని అన్నప్రసాద వితరణ చేశారు. ఆయా ఆటోస్టాండ్ల కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో కళాశాలలో..

ఏవీఎన్ కళాశాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజలు, దాండియా ఆటలు, గాజుల పండగతో మహిళలు సందడి చేశారు. ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పర్యవేక్షణలో కళాశాల అన్ని విభాగాలకు చెందిన అధ్యాపక బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, కృష్ణకుమారి, భానుమతి, గాంధీ, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మగా సాగరగిరి కనకదుర్గ..

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగరగిరి దుర్గమ్మ శనివారం కనకదుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న మన్యాల శ్రీనివాస్ దంపతులు

బంగారుమెట్టలో..

బంగారుమెట్ట శ్రీ బాల దుర్గా గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు రోహిత్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వినీత్‌రెడ్డి, రఘు, హరీష్, లికిత్‌కుమార్, అరవింద్ కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మిగా పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ..

జగదాంబ: పూర్ణామార్కెట్ జంక్షన్‌లో కొలువుదీరిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు శనివారం శ్రీ మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో పి.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, ధర్మకర్తలు డి.లక్ష్మీనారాయణ, కె.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రమణమ్మ, డి.వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



ఏవీఎన్ కళాశాలలో సరస్వతీ పూజ చేస్తున్న అధ్యాపక బృందం



బంగారుమెట్ట దుర్గమ్మను దర్శించుకుంటున్న బొర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- కోడిపండ్యాల వీధిలో రూ. కోటీ 18 లక్షలతో రోడ్డు విస్తరణ, రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్–4 పరిధి 30వ వార్డు కోడిపండ్యాల వీధి (ఎగువ రెల్లివీధి)లో రూ. కోటీ 18 లక్షలతో రోడ్డు విస్తరణ, రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ ప్రజలకు సంక్షేమంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. జీవీఎంసీ నిధులే కాకుండా ఎమ్మెల్యే నిధులతో కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పలరత్నం, జోనల్ కమిషనర్ శివప్రసాద్, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోష్, వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు, మండల అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ నాయకులు సత్యనారాయణ, దశమంతుల చిన్ని, ఆదివిష్ణు, లండా రమణ, బోని దేవా, ముజీబ్‌ఖాన్, కోన రాము, శ్యామ్, ఎర్రబెల్లి ప్రభాకరరావు, సంతోష్, అప్పన్న, రెల్లికుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు డిమాండ్



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

సీతమ్మధార : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలో మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్ కాకుండా ఉద్యోగ విరమణ అనంతరం గౌరవప్రదంగా జీవించేలా ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దేముడుబాబు, జి.వర హాలదొర, ఐవీ రామిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సునీత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 22 నుంచి 28 వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. 22 సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. బ్రహ్మశ్రీ కలగా మురళీకృష్ణచే దేవీమహత్యంపై ప్రవచనం, 23 సాయంత్రం 6 గంటలకు రేడియో, టీవీ ఆర్టిస్ట్ యతిరాజు భాగవతార్ ఆధ్వర్యంలో హరికథా గానం, 24న సుధా సీతాపతిరావుచే హరేరామ సంకీర్తన, 25న సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, 26న సాయిరాజు భక్తి రంజని బృందంచే భజనలు, 27న వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ప్రతినిధి కె.సునీత సారధ్యంలో కోలాటం, 28 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితా మాతృ మండలి మహిళా సభ్యులచే సామూహిక పారాయణ జరుగుతాయన్నారు.

మున్సిపల్ స్టేడియంకు దొంగల బెడద



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం

జగదాంబ : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు దొంగల బెడద ఎక్కువయింది. జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న ఈ స్టేడియంలో విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్, జీవీఎంసీ సచివాలయాలు, మెకానికల్ సెక్షన్‌తో పాటు నగరపాలక సంస్థకు చెందిన స్క్రాప్ వాహనాలు, ఇతర వస్తువులన్నీ ఇక్కడే భద్రపరుస్తుంటారు. ఈస్టేడియంకు గతంలో సెక్యూరిటీ గార్డులు ఉండడంతో అనుమతి లేని వారిని లోపలికి పంపించేవారు కాదు. దీంతో ఇక్కడ దొంగతనాలు జరిగేవి కాదు. అయితే జీవీఎంసీ అధికారులు జీతాలు చెల్లించలేదంటూ సంవత్సర కాలంగా సెక్యూరిటీ గార్డులు ఇక్కడ పని చేయడంలేదు. దీంతో స్టేడియం అందరికీ అనువుగా తయారైంది. యువకులు ఇక్కడ క్రికెట్ ఆడుకోవడానికి వచ్చి తర్వాత మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా మరి కొందరు స్టేడియంలో ఉండే జీవీఎంసీకి చెందిన సామగ్రిని దొంగిలిస్తున్నారు. సచివాలయాలకు ఎవరు వస్తున్నారో ఎవరు వెళ్తున్నారో తెలియడం లేదని సెక్రటరీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్టేడియంకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సీఎం కృషితో పదిలంగా పేదల ఆరోగ్యం



దండుబజార్ సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, నారాయణరావు

మహారాణిపేట : జీవీఎంసీ 29వ వార్డు దండుబజార్‌లో రెండవ రోజు జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవతో పేదల ఆరోగ్యం పదిలంగా మారిందని, కనీవినీ ఎరుగని రీతిలో జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో షుగర్, బీపీ, థైరాయిడ్, కంటి వైద్య పరీక్షలు, ఊపిరితిత్తుల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పేదలు వైద్యానికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా సీఎం జగనన్నే పేదల ఆరోగ్య బాధ్యత తీసుకుంటున్నారన్నారు. కార్పొరేటర్ వురికిటి నారాయణరావు మాట్లాడుతూ వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయకుండా జగనన్న సురక్షతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు చేరువ చేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్, సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు, వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఆర్పీలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు

త్వరితగతిన శివాజీ పార్కు అభివృద్ధి పనులు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం
- ఆధునికీకరణ పనులపై ఆరా



ఆధునికీకరించిన వాటర్ ఫౌంటైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : శివాజీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. శనివారం ఉదయం పార్కును సందర్శించిన ఆయన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన శివాజీ పార్కును జీవీఎంసీ ఆధునికీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా పార్కు పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.2 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతుండగా.. పార్కు ముఖద్వారం మార్పుతో పాటు సందర్శకుల సౌకర్యార్థం అనేక వసతులు సమకూర్చుతున్నారు. కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫౌంటేన్లను రూ.50 లక్షల వ్యయంతో ఆధునికీకరిస్తున్నారు. శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులను పర్యవేక్షించిన కమిషనర్.. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్–3 ఈఈ శ్రీనివాసరావు, ఏఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇది ఉద్యోగులకు మేలు చేసే ప్రభుత్వం

వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోందని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా శనివారం డీఏ మంజూరు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేయటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కోవిడ్ విపత్తు తరువాత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, వాటన్నింటినీ అధిగమిస్తూ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను ఒక్కొటి పరిష్కరిస్తోందన్నారు. మిగతా ప్రయోజనాలను సైతం మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగానే పని చేస్తున్నారన్నారు. కొంతమంది కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూల వాతావరణంలో ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వైఎస్సార్‌టీఎఫ్ పక్షాన వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్

ఏయూ క్యాంపస్: విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్ సాకారం అవుతుందని ఐఏఎస్‌ఈ ఆచార్యులు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు అన్నారు. శనివారం ఉదయం ఏయూ ఐఏఎస్‌ఈలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వర్సిటీని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడం కోసం విద్యార్థులను భాగస్వాములను చేస్తూ నిరంతరం ఈ కార్యక్రమం చేపడతామని షారోన్‌రాజు తెలిపారు.

పెరిగిన నిమ్మకాయల ధర



పూర్ణామార్కెట్‌లో నిమ్మకాయల వ్యాపారులు

జగదాంబ : దసరా నేపథ్యంలో నిమ్మకాయల ధరకు రెక్కలొచ్చాయి. ఏలూరు కేంద్రంగా విశాఖకు దిగుమతయ్యే నిమ్మకాయల బస్తా రూ.7 వేలకు పైగా పెరగడంతో రిటైల్ మార్కెట్లో కూడా ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. రూ.10కి అయిదు నిమ్మకాయలు అమ్మే వారంతా ఇప్పుడు రూ.20కి నాలుగు మాత్రమే ఇస్తున్నారు.

270 మంది ఖైదీలకు నేత్ర పరీక్షలు



కేంద్ర కారాగారంలో ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో శనివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు. 270 మంది ఖైదీలకు కంటి పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన 142 మంది ఖైదీలకు కళ్ల జోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరికి ఒకటి, రెండు రోజుల్లో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప సూపరింటెండెంట్ రామచంద్రరావు, కంటి ఆస్పత్రి వైద్యులు సర్వణ్, రత్నంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ కారులో పర్యవేక్షణ



భవనాల పరిశీలనకు బ్యాటరీ కారులో వెళుతున్న అధికారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ హిత ఆంధ్ర విశ్వవిద్యాలయం కోసం అధికారులు మరో అడుగు వేశారు. వర్సిటీలో భవనాల పరిశీలనకు శనివారం బ్యాటరీ వాహనంలో వెళ్లారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వాహనాన్ని స్వయంగా నడపగా, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ డాక్టర్ జి.వీర్రాజు వెనక కూర్చుని పర్యవేక్షించారు. వర్సిటీలో భవిష్యత్తులో బ్యాటరీ వాహనాల వినియోగం పెంచుతామని అధికారులు తెలిపారు.

ఎంబర్‌మన్నార్ ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డు పరిధి కంచరవీధిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం శనివారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఈవో నీలిమ, ఇన్‌స్పెక్టర్ వసంత్‌కుమార్ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని సూచించారు. పురాతన చరిత్ర కలిగిన ఎంబర్‌మన్నార్‌స్వామి దేవాలయ పాలకమండలిలో స్థానం సాధించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పీతల వాసు, సనపల రవీంద్రభరత్, బుద్దల అనురాధ, మీసాల అశోక్‌కుమార్, వడ్డాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా చైర్మన్‌గా టేకు ప్రసాదరావు, ధర్మకర్తలుగా గనగళ్ల రామరాజు, రాయితీ సతీష్, సారిపల్లి అరుణ, సుగ్గు శిరీష, పొట్నూరు పార్వతి, పి. ఈశ్వరమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా మద్దాల సత్యలక్ష్మణాచార్యులు పాలకమండలికి ఎన్నికయ్యారు.

పోష్ కమిటీ ఏర్పాటు అవసరం



మాట్లాడుతున్న దిశా సీఐ నిర్మల

సీతంపేట: అంతర్జాతీయ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి దిశా పోలీస్ స్టేషన్ సీఐ నిర్మల మాట్లాడుతూ కార్యాలయాలు, కళాశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ఇలా మహిళలు పనిచేసే ఏ ప్రదేశంలో నైనా పది నుంచి 15 మంది మహిళలు ఉంటే పోష్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ పురుషుల నుంచి గాని, మహిళల నుంచి గాని లైంగిక వేధింపులు ఎదుర్కొంటే పోష్ కమిటీ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటుందన్నారు. సంస్థ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ దుడ్డి ఇందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోష్ కమిటీ సభ్యులు కోరాడ స్వర్ణ, యాక్షన్‌ఎయిడ్ ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్ లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
✆ 9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com